దోమలను అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి -అంబాజీపేట

అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం అడిషనల్ డిఎంహెచ్ఓ సిహెచ్. వి. భరతలక్ష్మి శుక్రవారం రికార్డులు తనిఖీ చేశారు. డ్రై డే – ఫ్రై డే మాచవరం-1 సర్వేను పరిశీలించారు. అనంతరం మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ వ్యాప్తి, దోమల ఆవాసాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో మెటాల్ స్ప్రేకెల్ వేస్ట్ ఆయిల్ వేస్తే దోమలను నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీనివాస్ సిహెచ్ఓ బి.అప్పారావు, ఎఎన్ఎమ్, ఆశాలు, పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డిఎంహెచ్ఓ

టిడిపిని గెలిపిస్తే భవిష్యత్తుకు గ్యారంటీ

- వచ్చే ఎన్నికల్లో జగన్ చిత్తుగా ఓడించాలి
- కోనసీమ కొబ్బరి రైతుకు పూర్వ వైభవం తెస్తాం
- టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు



అమలాపురంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు


ప్రజాశక్తి-అమలాపురం

వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని, జగన్‌ను చిత్తుగా ఓడించాలని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన అమలాపురంలో పర్యటించారు. తొలుత సత్యనారాయణ గార్డెన్స్‌లో రైతులు, వైద్యులు, న్యాయవాదులు, వేదావులు, మేధావులతో ముఖాముఖి నిర్వహించారు. వారి నుంచి రాష్ట్ర అభివృద్ధికి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం నల్లవంతెన సెంటర్ నుంచి గడియారస్తంభం సెంటర్ వరకూ రోడ్ షో నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతానన్న జగన్ ఇప్పుడు కేంద్రం వద్దకు వెళ్లి తానే మెడ వంచే పరిస్థితి వచ్చిందన్నారు. అధికారం కోసం తల్లిని, చెల్లిని కూడా వాడుకున్నారన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం వైసిపి ఎంపీలు పార్లమెంట్‌లో నోరు విప్పిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో ఇసుకాసురులు ఎక్కువ అయ్యారని, సామాన్యులకు ఇసుక దొరికే పరిస్థితి లేదన్నారు. అమలాపురంలో యానాం-ఎదుర్లంక వారధి, ఆర్‌డిఒ కార్యాలయం, కలెక్టరేట్ భవనం ఇవన్నీ టిడిపి హయాంలో మాజీ లోక్ సభ స్పీకర్ బాలయోగి అభివృద్ధి చేసినవేనని గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమలాపురానికి ఏం మేలు చేశారని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, పెట్రో ఉత్పత్తులను సామాన్యులు కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు, చెత్త పన్నుతో ప్రజలపై వైసిపి సర్కారు పెనుభారం మోపిందన్నారు. అధికారంలోకొస్తే రూ.3వేలు పింఛను ఇస్తానని సిఎం జగన్ ఏడాదికి రూ.250 మాత్రమే పెంచుతూ మోసం చేశారన్నారు. ఒక్క అవకాశం అని చెప్పి ప్రజలను నమ్మించి నట్టేట ముంచారన్నారు. రోడ్లపై ప్రయాణించాలంటే భయమే స్ఫురిస్తోందన్నారు. తాము అధికారంలోకొచ్చిన వెంటనే కొబ్బరి రైతులకు పూర్వ వైభవం కల్పిస్తామన్నారు. ఒక కోడిగుడ్డు, ఒక నిమ్మకాయ, ఒక జామ కాయకు ఉన్న రేటు కొబ్బరికాయకు లేదన్నారు. అమలాపురంలో ఎన్నడూ లేనివిధంగా గంజాయి ముఠాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచి సంపద సృష్టించడం ద్వారా పేదరికం లేని సమాజం కోసం టిడిపి పాటుపడుతుందన్నారు. మహిళకు ప్రాధాన్యత ఇచ్చింది టిడిపియేనన్నారు. మహిళలు ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, మహిళా యూనివర్సిటీలో వంటివి ఏర్పాటు చేసింది టిడిపి హయాంలోనే అని గుర్తు చేశారు. డ్వాక్రా సంఘాలు తీసుకొచ్చిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనన్నారు. తాము అధికారంలోకి వస్తే మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. యువతకు ఏపాటి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తామన్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపుతామన్నారు. జగన్ ప్రభుత్వం అంగన్‌వాడి వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, పిల్లలకు పౌష్టికాహారం అందించడంలోనూ నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. జగన్ ట్యాక్స్‌లతో ఆక్వారంగం నిర్వీర్యమైందన్నారు. అధికార, పోలీస్ వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకొని రౌడీయిజం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. స్థానిక సత్యనారాయణ గార్డెన్ నుంచి గడియార స్తంభం సెంటర్ బహిరంగ సభకు బయలుదేరిన చంద్రబాబు మార్గమధ్యలో జిఎంసి బాలయోగి ఘాట్‌ను సందర్శించారు. బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు, టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గంటి హరీష్‌మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

'వాడ్రేవుపల్లి' సర్పంచ్‌కు చంద్రబాబు అభినందన

ప్రజాశక్తి -మామిడికుదురు(పి.గన్నవరం)

అమలాపురం పర్యటనలో ఉన్న చంద్రబాబును వాడ్రేవుపల్లి సర్పంచ్ ప్రత్తిపాటి ఉమామహేశ్వరి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పి.గన్నవరం నుంచి మహిళా భేరితో కలిసి వెళ్లి చంద్రబాబుకు స్వాగతం పలికారు. పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ మహిళలను చైతన్యం చేస్తూ వరదల సమయంలో ముంపు ప్రాంతాల్లో సేవలందించిన సర్పంచ్‌ను చంద్రబాబు అభినందించారు.



చంద్రబాబును కలిసిన సర్పంచ్

చంద్రబాబుకు పి.గన్నవరం ఎంపిపి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-మామిడికుదురు(పి.గన్నవరం)

మహిళల సంక్షేమం కోసం టిడిపి రూపొందించిన మేనిఫెస్టో పట్ల పి.గన్నవరం ఎంపిపి అంబటి భూలక్ష్మి శుక్రవారం హర్షం వ్యక్తం చేస్తూ అమలాపురం పర్యటనలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలతో నిర్వహించిన సమావేశానికి స్థానిక మహిళా నాయకురాళ్లతో కలిసి చంద్రబాబుకు ఎంపిపి స్వాగతం పలికారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

టిడిపి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-అల్లవరం

అమలాపురంలో టిడిపి బహిరంగ సభకు అల్లవరం మండలం గుండెపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పోతుల సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. బహిరంగంగా సభకు చంద్రబాబు వస్తుండటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.



చంద్రబోస్ఆధ్వర్యంలోబైక్ర్యాలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కృష్ణవేణి, పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

పారిశుధ్య కార్మికుల మానవహారం

ప్రజాశక్తి-మండపేట

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని శుక్రవారం తెల్లవారుజామున స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చి 4 ఏళ్లు అవుతున్నా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోవడం దారుణం అన్నారు. పట్టణ పరిశుభ్రతకు పాటుపడుతూ కరోనా సమయంలోను వారి ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించిన కార్మికులను దృష్టిలో ఉంచుకొని వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక నాయకులు కుమారపునరేంద్రకుమార్, బంగారు కొండ, కె.విజయ్, నాగేంద్రప్రసాద్, చిన్న, రాజు, లావరాజు, హేమలత, రత్నం, అమ్ములు, సన్యాసమ్మ, ఆదిలక్ష్మి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అమలాపురం రూరల్ మండలం కామనగరువు నల్లా సత్యనారాయణ లే అవుట్‌లో వేదాంత సిఎస్ఆర్ నిధులతో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మంత్రి పినిపే విశ్వరూప్ తో కలిసి కామనగరువు సర్పంచ్, సర్పంచుల సమైక్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శంకుస్థాపన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపేట వేస్తోందని అన్నారు. రూ.38.5 లక్షల అంచనా వ్యయంతో ఈ వాటర్ ట్యాంక్ ను నిర్మించనున్నట్లు సర్పంచ్ అరుణ కుమారి తెలిపారు. దీంతో ప్రజలందరకు శుద్ధ జలం అందుబాటులోకి వస్తుందని అన్నారు. వాటర్ ట్యాంక్ ను త్వరితగతిన పూర్తి చేయాలంటే అందరి సహాయ సహకారాలు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీ హరి రాంగోపాల్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగెటి డోలా మణి, ఎంపిటిసి సభ్యురాలు మెండు గంగాభవాని, ఉపసర్పంచ్ రాజలపూడి భాస్కరరావు, వార్డు సభ్యులు, నడిపూడి సర్పంచ్ చెల్లిబోయిన నాని, తాండవపల్లి సర్పంచ్ ఏసుబాబు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కామనగరువులో శిలాఫలకాన్ని ఆవిష్కరణలో మంత్రి విశ్వరూప్


'కిమ్స్'లో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

కిమ్స్ డెంటల్ కాలేజ్ అమలాపురంలో డెంటల్ కౌన్సిల్ అఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈ నెల 12 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు 'యాంటీ ర్యాగింగ్ అవగాహనా వారోత్సవాలు' నిర్వహించామని ఎస్.ఐ. ఎ.పరదేశి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ అమానుమని, చట్ట రీత్యా నేరం అని తెలిపి, ర్యాగింగ్ అంటే ఏమిటి, దాని వలన కలిగే నష్టాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలు, ర్యాగింగ్ చేసిన వారికి, తోడ్పడిన వారికి చట్ట రీత్యా విధించబడే శిక్షల గురించి తెలిపారు. విద్యార్థులు ర్యాగింగ్ వంటి ప్రమాదకరమైన చట్ట వ్యతిరేక చర్యల నుంచి దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపి తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. కిమ్స్ డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శివ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలన్నారు. కళాశాల మేనేజర్ విజయ్ కుమార్ ఈ మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తత్వ పోటీలను నిర్వహించినటు తెలిపారు. డాక్టర్ సుమీత్ శర్మ , డాక్టర్ జి.కార్తీక్, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు అవగాహనా సదస్సులో పాల్గొన్నారు.

కిమ్స్ ఛైర్మన్ కెవివి.సత్యనారాయణ రాజు, ఎండీ రవి కిరణ్ వర్మ మాట్లాడుతూ ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు విద్యార్థులకు చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు.

కార్టూ'నిజం'



క్రీడాభివృద్ధికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో క్రీడలు అభివృద్ధికి యువత ముందుకు రావాలని ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అమలాపురంలో సాధనాల వాసు మెమోరియల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా అమలాపురం స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంబించిన కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న రంకి రెడ్డి కాశికి అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులను మనం తయారు చేసుకోవాలన్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా క్రీడా రంగానికి చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. క్రీడా అభివృద్ధికి పలు నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ఆర్‌డిఒ వసంత రాయుడు మాట్లాడుతూ సాయి సాత్విక్ మన రాష్ట్రానికి గర్వ కారణం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓమ్ములు నాయుడు, మెట్ల సూర్య నారాయణ, అమలాపురం తహశీల్దార్ పల్లవి, గోకరకొండ నాగేంద్ర, అల్లాడ శరత్ బాబు, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, వంటెద్దు బాబి, కల్వకొలను బాబు, చిక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఇ క్రాప్ బుకింగ్ పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశక్తి-మండపేట

రైతులు మేలు చేకూర్చేలా ఇ-క్రాప్ బుకింగ్ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం రాయవరం మండలంలో సోమేశ్వరం గ్రామంలో జగనన్న లే అవుట్లు, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. లేఔట్ అప్రోచ్ రోడ్లు, అంతర్గత రహదారులు లేఔట్లలో కనీసవసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి పి సింధు సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఎ పీడీ వి.శివ శంకర్ ప్రసాద్, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి బాబురావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎ.బోసు బాబు, ఎంపిడిఒ కె.నరేంద్ర, డిటి విజయ రేఖ, వ్యవసాయ అధికారి ప్రభాకర్, ఎపిఒ సుధారాణి, వెలుగు ఎపిఎం నజీర్, ఆర్ డబ్ల్యూఎస్ జెఇఇ చైతన్యకుమార్, సర్పంచ్ షేక్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి మండపేట

మండలంలోని తాపేశ్వరం 14వ వార్డు ఉప ఎన్నిక శనివారం జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి మండల అభివద్ధి అధికారి ఐదం రాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం సామగ్రితో పాటు సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్, అనంతరం అదే రోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి విజేతను ప్రకటిస్తారు. వార్డు పరిధిలో మొత్తం 504 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బంది

టేకి వార్డు సభ్యునిగా జయకిషోర్ ఏకగ్రీవం

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి గ్రామ పంచాయతీ 8వ వార్డు మెంబరు గా కుక్కల జయ కిషోర్ ఏకగ్రీవంగా గెలుపొందినట్లు శుక్రవారం ఎంపిడిఒ ఎం. రామ కృష్ణారెడ్డి తెలిపారు. అతనిపై పోటీకి నిలిచిన అభ్యర్థి తన నామినేషన్ ఉపసంహరి ంచుకోవ డంతో ఏకగ్రీవమైనట్లు ఆయన తెలిపారు.

సాగు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని సిరిపల్లి గ్రామ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వై.శోభ ఆధ్వర్యంలో వరి పంట యాజమాన్యం పద్ధతులపై పొలంబడి నిర్వహించారు ఈ సందర్భంగా పంట దశలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువులు, కలుపు మందుల వినియోగం, మిత్ర, శత్రు పురుగులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే సి ఆర్ సి కార్డుల ద్వారా కౌలు రైతులకు జరిగే ఉపయోగాలు, బ్యాంకు రుణాలు వంటి గురించి వివరి ంచారు. రైతు భరోసా కేంద్రాల్లో సమద్ధిగా ఎరువుల నిల్వలు ఉన్నాయని, అవసరమైన రైతులు వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అంబటి సత్యనారాయణ, గుత్తుల పెద్ద, వాసంశెట్టి విష్ణుమూర్తి, గుత్తుల నాగర్జున అంబటి చంటి గ్రామ వ్యవసాయ సహాయకులు టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి వై.శోభ

'టేకి' పిఎసిఎస్ అభివృద్ధికి కృషి

నూతన ఛైర్‌పర్సన్ జానకిరామయ్య

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

టేకి పిఎసిఎస్ అభివృద్ధికి కృషి చేస్తానని ఛైర్‌పర్సన్‌గా పుట్టా జానకి రామయ్య పేర్కొన్నారు. టేకి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ సంఘం ఛైర్‌పర్సన్‌గా జానకి రామయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు సభ్యులుగా నరాల సూర్యనారాయణ, గంటి సీతాదేవీలచే సొసైటీ సిఇఒ చిక్కం విజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జానకి రామయ్య మాట్లాడుతూ ఒక వికలాంగునికి త్రిసభ్య ఛైర్‌పర్సన్‌గా ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తన పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు రుణాల మంజూరులో వివక్ష చూపకుండా పనిచేస్తామన్నారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, ఆర్‌బికె ఛైర్మన్ పుట్టా కష్ణ బాబు, ఎంపిటిసి సభ్యుడు ఉమ్మడిశెట్టి వీర వేణి సూర్యనారాయణ, ఎఎంసి డైరెక్టర్ నక్కా సింహాచలం, సొసైటీ మాజీ ఛైర్ పర్సన్స్ కుక్కల శివ సుబ్రహ్మణ్యం, మట్టపర్తి పాలరాజు , మేడిశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.




ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపడుతున్న జానకి రామయ్య

ఊడిమూడిలో కలుషిత తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-రామచంద్రపురం

తాగునీరు కులుషితమైందని, రంగు మారి దుర్వాసన వెద జల్లుతున్న ఈ నీటిని ఎలా తాగాలని ఉడుమూడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కె.గంగవరం మండలం ఊడిమూడి గ్రామానికి కుందూరు నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. ఊడిమూడి, తామరపల్లి, సుందరపల్లికి ఈ నీరు సరఫరా అవుతుంది. కుళాయి వాటర్ ఇంత మురుకుగా ఉన్నాయని ఇవి తాగితే పలురోగాలు సోకుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు సరఫరా చేసే పైపులైన్లలో లీకులు ఏర్పడటం వల్ల నీళ్లు రంగు మారి ముదురు మట్టి రంగులోనికి సరఫరా అవుతున్నాయి. మంచినీళ్లు ఎలాతాగాలి అని సుందరపల్లి, ఊడిమూడి,త తామరపల్లి ఎంపిటిసి సభ్యుడు తాడాల రాజు ప్రశ్నిస్తున్నారు. వెంటనే స్వచ్ఛమైన సాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.దీనిపై గ్రామ కార్యదర్శి చంటిని వివరణ కోరగా కుందూరు నుంచి సిపిడబ్ల్యూఎస్ స్కీం ద్వారా సరఫరా అయ్యే మంచినీరు గ్రామపంచాయతీకి సంబంధం లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దీనిపై చర్యలు చేపట్టాలని ఆయన వివరించారు. దీనిపై వివరాలు అడిగెందుకు ప్రయత్నించగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఫోన్లో అందుబాటులోకి రాలేదు. సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రామంలో సరఫరా అవుతున్న కలుషిత తాగునీరు

చంద్రబాబు ఆరోపణలపై ఖండన

ప్రజాశక్తి-రావులపాలెం

జొన్నాడ ఇసుక స్టాక్ యార్డును సందర్శించి తనపైనా, ప్రభుత్వం పైనా చంద్రబాబు చేసిన ఆరోపణలను ప్రభుత్వ విప్, కొత్తపేట ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి మాజీ సిఎం చంద్రబాబు, స్థానిక మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదల సమయంలో భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడకూడదు అన్న ఉద్దేశంతో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కలెక్టర్ల ద్వారా ఇసుకను నిల్వ చేసి కొరత ఏర్పడకుండా చూస్తారన్నారు. ఇది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు కూడా జరిగిందన్నారు. అయితే గురువారం చంద్రబాబు జొన్నాడ ఇసుక స్టాకు యార్డును సందర్శించి ఇది తాడి నాగమోహన రెడ్డిదని, స్థానిక ఎంఎల్ఎదని,, లేదా జగన్మోహన్ రెడ్డిపై నిందలు మోపడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. గతంలో నేను ఎంఎల్‌ఎగా ఉన్నాను. మీరు ముఖ్యమంత్రి గా ఉన్నారు. అప్పుడు ఇదే జొన్నాడ లో స్టాకు పెట్టినప్పుడు మీరు తీసుకున్నారా.? అంటూ జగ్గిరెడ్డి ప్రశ్నించారు. కేవలం అధికారి పార్టీపై నిందలు వేయాలని ఇటువంటి తప్పుడు చేస్తున్నారని అన్నారు. 2024లో మళ్లీ వైసిపియే గెలుస్తోందని సర్వే రిపోర్టు రావడంతో దాంతో మతిభ్రమించి చంద్రబాబు తన స్థాయిని దిగజార్చుకొని అనారాని మాటలు మాట్లాడుతున్నారని జగ్గిరెడ్డి ఆరోపించారు. సిఎం జగన్ అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఆపడం ఎవరి వల్ల కాదన్నారు. సమావేశంలో గొల్లపల్లి డేవిడ్ రాజు, రావులపాలెం జెడ్‌పిటిసి సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, కొత్తపేట ఎంపిపి మార్గాని గంగాధరరావు, సాకా ప్రసన్నకుమార్, తమ్మన శ్రీనివాస్, చల్లా ప్రభాకరరావు, దండు సుబ్రహ్మణ్య వర్మ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడు కృష్ణకు వీల్‌చైర్ అందజేస్తున్న దృశ్యం

బాధితుని వీల్ చైర్ అందజేత

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఐ.పోలవరం గ్రామ పంచాయతీ పరిధిలో మురమళ్ల పంట కాలువ గట్టు వద్ద నివాసం ఉంటున్న పులపకూర సత్యవెంకట కృష్ణ ప్రమాదవశాత్తు కరెంటు స్తంభం మీద నుంచి పడటంతో మంచానికి పరిమితమయ్యాడు. కృష్ణకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు ప్రకారం శుక్రవారం ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి సమక్షంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ పిన్నమరాజు వెంకట పతిరాజు ద్వారా వీల్ చైర్, హైజినిక్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో విత్తనాల శ్రీనివాసరావు, కొర్లపాటి వరప్రసాదరావు, దంగుడు బియ్యం వెంకట రామయ్య, సాధనాల బాబురావు, రేవు యజ్ఞశ్రీ, వెంకట్రావు పాల్గొన్నారు.



ఆటో యూనియన్ల నాయకులతో అమ్మిరాజు

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ లోను గల ఆటో యూనియన్ లు ఐక్యతగా ఉంటూ సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరి ంచుకునేందుకు కృషి చేయాలని న్యాయవాది, వైసిపి న్యాయవిభాగం నాయకులు మాగాపు అమ్మి రాజు సూచించారు. రామచంద్రపురం, ద్రాక్షారామంలో గల ఆటో యూనియన్లకు విభేదాలు తలెత్తడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి ఈ మేరకు శుక్రవారం అన్ని యూనియన్ల నాయకులతోను, సభ్యులతోనూ మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. యూనియన్ల మధ్య విభేదాలు సామరస్య పూర్వకంగా పరిష్కరించారు. అందరూ కలిసి ఉండాలని ఐక్యతగా ఉంటే సమస్యలన్నీ పరిష్కరించుకోవచ్చు అని సూచించారు. దీనికి సభ్యులందరూ అంగీకరించడంతో సమస్య పరిష్కారమైంది. అనంతరం యూనియన్ నాయకులతో కలిసి ద్రాక్షారామ లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆటో యూనియన్ ఐక్యత కొనసాగాలని నినాదాలు చేశారు. సమావేశంలో పల్లె యూనియన్ల నాయకులు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన ప్రభుత్వ ఉపాధ్యాయునిపై కేసు

ప్రజాశక్తి-కొత్తపేట

విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎఎస్‌ఐ డి.శశాంక తెలిపారు. వాడపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ రాయుడు వెంకటసత్యనారాయణ 8వ తరగతి విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గత నెల 17న హెచ్‌ఎం చంద్రశేఖరానికి విద్యార్థినులు తెలిపారు. దీనిపై సత్యనారాయణను వివరణ కోరగా ప్రవర్తన మార్చుకుంటానని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చాడు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో పడాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులు సత్యనారాయణ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు. దీంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంఘటనపై ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌టిసి బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని జి.మేడపాడు వద్ద ఆర్‌టిసి బస్సు, బైకు ఢీకొన్న ప్రమాదంలో బైకుపై ఉన్న సప్పా సీతారామ్‌కు తీవ్ర గాయాలవగా బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం రాజమండ్రి నుంచి కాకినాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సు కెనాల్ రోడ్డుపైకి వేగంగా వచ్చి బైకును తప్పించేందుకు ఆర్‌టిసి డ్రైవర్ బస్సును కుడివైపుకు తిప్పగా గోదావరి కాలువ స్నానాల రేవులోనికి బస్సుకు దూసుకు పోయి మెట్లకు ఆనుకుని నిలిచిపోయింది. బస్సు టైర్‌కు పంచర్ అయి నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బైకుపై ఉన్న సీతారామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో సడన్ బ్రేక్ వేశారు. బస్సులో సుమారు 40 మంది ప్రయాణం చేస్తుండగా వారిలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు గోదావరి కాల్వలోకి దూసుకువెళ్ళి ఉంటే భారీ నష్టం జరిగి ఉండేంది. గాయపడ్డ సీతారామ్‌ను సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణికులను వేరే బస్సు ఎక్కించి పంపించారు.

పోలీసులకు చిక్కిన చైన్ స్నాచర్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని పారిపోతున్న చైన్ స్నాచర్‌ను వెంబడించి సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం సామర్లకోట సత్యనారాయణపురం ప్రాంతానికి చెందిన ఒక మహిళ రైల్వే స్టేషన్‌కు నడిచి వెళుతుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద అప్పటికే పొంచి ఉన్న దొంగ ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపుకొని పరారయ్యాడు. మహిళ బిగ్గరగా కేకలు పెట్టడంతో వంతెనపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు బైకుపై వెంటాడి నిందితుని పట్టుకున్నారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన వల్లి రాజేష్‌గా గుర్తించారు. అతడు పాత నేరస్తుడని ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు తెలిపారు.



ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో నేలపై జాతీయ పతాకాలు

నడిచే దారిలో పడేసిన జాతీయ పతాకాలు

నిబంధనలు పట్టించుకోని పోలీస్ స్టేషన్

ప్రజాశక్తి-రామచంద్రపురం

జాతీయ పతాకాన్ని ఎగురవేయడం వాటిని భద్రపరచడం వంటి నిబంధనలను పోలీసులే పట్టించుకోని వైనం ద్రాక్షారామలో వెలుగు చూసింది. వివరాలు ఇవి.. ఆగస్టు 15 సందర్భంగా అన్ని కార్యాలయాల్లోనూ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా అలంకరణకు ఏర్పాటుచేసిన జాతీయ జెండాలను తీసి భద్రపరచవలసి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్కడపడితే అక్కడ జాతీయ పతాకలో పడవేయడం, కాలితో తొక్కడం వంటివి చేయరాదని నిబంధనలు ఉన్నప్పటికీ ఇక్కడ పోలీస్ స్టేషన్లో అందరం నడిచే కారిడార్ లో జాతీయ జెండాలు ఇస్తాను రీతిగా పాడవేశారు. స్టేషనుకు వచ్చే పలువురు వీటిని గమనించకుండా తొక్కుకుంటూ తిరుగుతున్నారు. కనీసం నిబంధనలను పాటించని ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిస్థితులు చూసి పలువురు అంటున్నారు. చట్టాలను కాపాడాల్సిన పోలీసులు కనీసం జాతీయ జెండాలను పడవేసినా పట్టించుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పోలీసుల నిబంధన పాటించకపోతే ఇక సామాన్యంగా పరిస్థితి ఏమిటిని పలువురు ప్రశ్నిస్తున్నారు.దీనిఐ ద్రాక్షారామ ఎస్ఐ బి.వినోద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

'ప్రజల కోసం పని చేసేవాడే నాయకుడు'

ప్రజాశక్తి-మండపేట

అధికారమైనా ప్రతిపక్షమైన ప్రజల కోసమే పనిచేసేవాడే నాయకుడని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రోడ్లు, టిడ్కో గృహాలు, కమ్యూనిటీ హాళ్ల తదితర వాటిపై ప్రశ్నిస్తుంటే వాటికి సమాధానం చెప్పకుండా ఇసుక గురించే మాట్లాడుతున్నారని, మీ ప్రభుత్వంలోనే మీ అనుచరుడు అక్రమంగా ఇసుక తవ్వినందుకు జరిమానా విధిస్తే అతనినే మున్సిపల్ కో ఆప్షన్ సభ్యునిగా నియమించిన ఘనత మీదికాదా అని ప్రశ్నించారు. మండలంలోని కేశవరం, ద్వారపూడి, వేములపల్లిలలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేసి కాలువ గట్లకు రెండులారీలు వేసి మిగిలిన గ్రావెల్ ఎక్కడకు తరలించారో తనకు తెలుసని మైనింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో అవినీతి నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



పనులను పరిశీలిస్తున్న ఆర్ఎఒ

ఆయుష్ హాస్పిటల్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

యానాంలో నిర్మిస్తున్న ఆయుష్ హాస్పటల్‌ను పరిపాలన అధికారి మునిస్వామి శుక్రవారం పరిశీలించారు. గోపాల్ నగర్‌లో నిర్మిస్తున్న ఆయుష్ హాస్పటల్ని ప్రజా పనుల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను వేగవంతం చేసి అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా పనుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీర సెల్వం, జెఇలు యాళ్ల వీరాస్వామి, పిల్లి భాస్కరరావు, కాంట్రాక్టర్లు వి.భాస్కరరాజు, గొర్రెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు తగవు

ప్రజాశక్తి - యానాం

యానాంలో కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకంటానని మందపాటి భైరవమూర్తి హెచ్చరించారు. తనపై భూ కబ్జా ఆరోపణలు చేస్తున్నారని అవి నిజం కాదని భైరవమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తాను 32 ఎకరాల భూమిని కబ్జా చేయలేదని కేవలం అక్కడ ఉన్నది 4 ఎకరాల 92 సెంట్లు మాత్రం ఉన్నదని అది కూడా న్యాయంగా కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. కానీ కొంతమంది సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ బురద జల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎల్‌డిసికి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎల్‌డిసి, స్టోర్ కీపర్ ఉద్యోగాలకు ఈ నెల 27న నిర్వహించనున్న రాతపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలని డిపిఆర్ఒ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన

కరప : కరప గ్రామంలో వివిధ కాలనీల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించరాఉ. ఎంపిహెచ్‌ఒలు, హెచ్‌విలు, ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఆధ్వర్యంలో నిర్వహించినట్టు మండల వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. కాలనీల్లో ఉన్న డ్రైనేజీలలో దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేయడం, నాప్తలిన్ పిల్స్ వేయడం, ఇంటి ఆవరణలో ఉన్న చెత్తాచెదారం తొలగించి, కొబ్బరి బొండాలు, టైర్లు, రుబ్బురోలు నిలవ నీరు ఉండే ప్రదేశాలు లేకుండా, శుభ్రపరుచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ముగిసిన సత్య విదియ వేడుకలు

అన్నవరం : అన్నవరం దేవస్థానంలో సత్యవిదియ వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. స్వామివారి ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనివేటి మండలంలో స్వామివారి సోమవారం ఉత్సవ ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేశారు దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, చైర్మన్ ఐవి.రోహిత్ పాలకమండలి సభ్యుల సమక్షంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కళాక్షేత్రం నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ కళాక్షేత్ర పనులను వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కళాక్షేత్ర నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాన్ని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న కాంట్రాక్టర్, స్మార్ట్ సిటీ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ చివరి నాటికల్లా అన్ని పనులు పూర్తి చేసుకుని, వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కన్‌స్ట్రక్షన్ మేనేజర్ కామేష్, శ్రీ సూర్యరామ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు ఉన్నారు.

కన్వర్టబుల్ స్టేడియం పనుల పరిశీలన

స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్‌జనాగ నరసింహారావు పరిశీలించారు. రూ.8.20 కోట్ల వ్యయంతో సురేష్ నగర్‌లో దీనిని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 1200 సీట్ల సామర్థ్యంతో ఈ కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణం జరుగుతోందన్నారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించేందుకు వీలుగా స్టేడియం నిర్మాణం జరుగుతోందన్నారు. పనులను మరింత వేగవంతం చేసి త్వరలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ మంజూరు చేస్తామని అధికమొత్తంలో సొమ్ములు వసూలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ బి.శ్రీనివాసు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో కొంతమంది అధికారులుగా, ఏజేంట్లుగా చలామణి అవుతూ వ్యాపారస్తుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ములు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. పెద్దాపురం పట్టణానికి చెందిన సానాబత్తుల దుర్గాప్రసాద్, ఫుడ్ సేఫ్టీ లైసన్సులు ఇప్పిస్తానని వ్యాపారుల నుంచి రూ.వేలు కాజేసినట్టు తమ విచారణలో తేలిందన్నారు. అతడిపై పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వ్యాపారస్తులు తమకు కావలసిన అనుమతి పత్రాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని, మోసగాళ్ల మాయలో పడవద్దని సూచించారు. ఏదైనా వివరాలకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కెవి.సుబ్బారావు, సెల్ నెంబర్ 9494297564, ఫుడ్ కంట్రోలర్ 99896 88699 నెంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

జార్జిపేట సర్పంచ్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- తాళ్లరేవు

జార్జిపేట పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. పంచాయతీలో 1,769 మంది పురుష ఓటర్లు, 1,725 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పంచాయతీ పరిధిలో 14 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక పోలింగ్ అధికారి(పిఒ) అసిస్టెంట్ పోలింగ్ అధికారి(ఎపిఒ) ఇతర పోలింగ్ అధికారులు (ఒపిఒ) ఉంటారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సుమారు 80 మంది సిబ్బందితోపాటు 84 మంది పోలీసులను ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోరంగి ఎస్ఐ. పిశ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జార్జిపేట పంచాయతీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా విద్యాసాగర్ కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వరలక్ష్మి వ్యవహరించనున్నారు.

వైద్యురాలి అనుచిత వ్యాఖ్యలతో ఆశాల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు



ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

తాళ్లరేవు సిహెచ్‌సి పిల్లల వైద్యురాలు స్నేహలత ఆశ వర్కర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని సిహెచ్‌సి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడారు. జూలై 27న తాళ్ళరేవు సిహెచ్‌సిలో జరిగిన ఒక సమావేశంలో పిల్లల వైద్యురాలు స్నేహలత ఆశ వర్కర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. దీనిపై సిహెచ్‌సి సూపరింటెండెంట్ పి.శిరీషకు జూలై 31న ఫిర్యాదు చేశామని తెలిపారు. మూడు రోజుల క్రితం ధర్నా చేస్తున్నట్లు నోటీసు ఇచ్చినా ఎటువంటి సమాధానం రాకపోవడంతో ధర్నాకు దిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు సుమారు గంటసేపు మెయిన్ రోడ్డుపై ధర్నా చేశారు. వైద్యురాలు స్నేహలత బయటికి వచ్చి సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు డిమాండ్ చేశారు. దీంతో సూపరింటెండెంట్ పి.శిరీషతో కలిసి వైద్యురాలు స్నేహలత వారితో చర్చించారు. ఆశ వర్కర్లకు క్షమాపణ తెలపడంతో వారు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, తాళ్లరేవు మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, సిహెచ్‌సి డైరెక్టర్ అద్దంకి లక్ష్మీనారాయణ, పొన్నాడ భైరవమూర్తి, గంజా సూరిబాబు, ఆశ వర్కర్ యూనియన్ నాయకులు నాగలక్ష్మి, అనంతలక్ష్మి, జయ పుష్ప, భవాని, కళావతి, యు.అనంతలక్ష్మి, శారదా దేవి, జి.శ్రీదేవి పాల్గొన్నారు.

టిడిపిలో లక్ష్మణరావు చేరిక

కాకినాడ కార్పొరేషన్ : టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో నున్న లక్ష్మణరావు (దొరబాబు) పార్టీలో చేరారు. శుక్రవారం ఉదయం కాకినాడలోని టిడిపి జిల్లా కార్యాలయం నుంచి దొరబాబు తన అనుచరులతో అమలాపురం తరలి వెళ్లారు. అక్కడ చంద్రబాబు నిర్వహిస్తున్న సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపైన ఉన్న చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిచ్చి శాలువతో సత్కరించారు. అనంతరం దొరబాబును చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. దొరబాబు గతంలో టిడిపి కాకినాడ నగర అధ్యక్షునిగా పని చేశారు.

జిల్లాలో 91 శాతం ఓటరు జాబితా సవరణ పూర్తి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా 1,641 పోలింగ్ కేంద్రాల్లో ఇంటింటి సర్వే ఇప్పటి వరకు 91 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపా రు. శుక్రవారం అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ అంశాల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో 1,641 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఎన్నికల జనాభా నిష్పత్తి 739 నమోదైందన్నారు. ఇప్పటివరకు ఇంటింటి సర్వేలో భాగంగా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 86.45 శాతం, ముమ్మిడివరంలో 92.10 శాతం, అమలాపురంలో 96.58 శాతం, రాజోలు 96.82 శాతం, పి గన్నవరం లో 86.08 శాతం, కొత్తపేటలో 87.55 శాతం, మండపేట అసెంబ్లీ నియోజ క వర్గంలో 92.38 శాతం మేర ఇంటింటి సర్వే పూర్తికాబడిందన్నారు. బిఎల్ఒ యాప్ లో 66 శాతం ఇంటింటి సర్వే ప్రక్రియ పూర్తయిం దని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల నమోదు అధికారులైన డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎస్.సుధా సాగర్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి జివి.సత్యవాణి, కొత్తపేట తహశీల్దార్ జిడి.కిషోర్ బాబు, సెక్షన్ సూపరింటెండెంట్ రమణకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

ఇవిఎం, వివిప్యాట్ల గొడౌన్ తనిఖీ

స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల నందు గొడౌన్‌లో ఉన్న ఇవిఎం, వివిప్యాట్లను శుక్రవారం రెవెన్యూ, ఎన్నికల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తనిఖీ చేశారు. ముందుగా గొడౌన్‌కు వేసిన తాళం సీలును పరిశీలించారు. అనంతరం గొడౌన్‌లో భద్రపరిచిన ఇవిఎంలు, వివి ప్యాట్లను ఆయన పరిశీలించారు. అదేవిధంగా సిసి కెమెరాలను పరిశీలించారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను భద్రతా చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రతకు చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-ఆలమూరు

రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తెలిపారు. పెద్దపళ్ళలో ఆయన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నమోదులో ఉత్పన్నమయ్యే సమస్యలను అడిగి తెలుసుకుని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇ పంట నమోదుకు రైతుల పొలం పాస్ బుక్, ఆధార్, ఫోన్ నెంబర్, ఏ పంట సాగు చేస్తున్నారనేది ఆయా గ్రామాల్లో ఆర్‌బికెలో సంప్రదించాలన్నారు. అలాగే కౌలు రైతులయితే భూ యజమాని అనుమతితో కూడిన సిసిఆర్‌సి కార్డుతో ఆర్‌బికెలో సంప్రదించాలన్నారు. పంట నమోదు చేసుకోని రైతులకు పంట నష్టపరిహారం, ధాన్యం అమ్మకాలకు కనీస మద్దతు ధరచ పథకాలు వర్తించవని అన్నారు. కార్యక్రమంలో ఆలమూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ లావణ్య, పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



తహశీల్దార్ వెంకటేశ్వరి ని సత్కరిస్తున్న దృశ్యం

విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన సేవలు గుర్తింపునిస్తాయని డాక్టర్ వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్శిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరావు అన్నారు.జగనన్న సురక్ష, వరదల సమయంలో చేసిన సేవలకు గుర్తింపుగా తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి కి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేశ్వరిని జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజాకుమారిలు దుశ్శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహశీల్దార్ వెంకటేశ్వరరి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, ఎఎస్ఒ, గుర్లింక సద్గురుప్రసాద్, విఆర్ఒ, సూర్యకుమారి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.